సాక్షి కామారెడ్డి

బుధవారం । 14 । మే । 2025



పేదల కల నెరవేరింది

ఎల్లారెడ్డిలోని ఏడో వార్డులో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు భూమి పూజ చేశారు.

- 8లో ▸



ప్రజల్లోకి తీసుకువెళ్లండి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కార్యకర్తలకు సూచించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
38.9 /22.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత తగ్గవచ్చు. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'తూకంలో తేడాలు రావొద్దు'



లింగంపేట : ధాన్యం తూకంలో తేడాలు రాకుండా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మంగళవారం ఆయన పోతాయిపల్లి శివారులోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తూకాలు సక్రమంగా చేపట్టి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కాంటాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. తూకం వేసిన బస్తాలను వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. అనంతరం లింగంపేట తహసీల్ కార్యాలయంలో భూభారతి అర్జీలను పరిశీలించారు. భూభారతి సమస్యల పరిష్కారం పనులను వేగవంతం చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

532 ఇళ్లు మంజూరు



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మున్సిపాలిటీకి 532 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఒకటో వార్డులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారికి విడుతల వారీగా బిల్లులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి, ఏఈలు అశోక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'వేగవంతం చేయాలి'



నాగిరెడ్డిపేట : రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను బ్యాంకులకు పంపే ప్రక్రియను వేగవంతం చేసి గురువారంలోపు బ్యాంకుల స్థాయిలో పరిశీలనను పూర్తి చేయాలని డీఆర్‌డీవో సురేందర్ ఆదేశించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని, సేకరించిన ధాన్యం వివరాల ట్యాబ్‌ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఐకేపీ సీసీలను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రభాకరచారి, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్, జూనియర్ అసిస్టెంట్ అరుణ్, సీసీలు నారాయణ, దత్తు, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, రషీద్ ఉన్నారు.

'సరస్వతి' పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 26 వరకు భూపాలపల్లి, కాళేశ్వరంలలో జరిగే పుష్కరాలకు నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ నుంచి స్పెషల్ హైర్ పద్ధతిలో ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా డిపాజిట్ లేకుండానే ముందస్తుగా బస్సులు బుక్ చేసుకొని, సౌకర్యవంతమైన ప్రయాణం చేయడానికి అవకాశం కల్పించామని తెలిపారు.

'తెలంగాణ రన్' అంబాసిడర్‌గా అశోక్



వేల్పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వచ్చే నెల 8న నిర్వహించనున్న తెలంగాణ రన్–2025కు బ్రాండ్ అంబాసిడర్‌గా వేల్పూర్‌కు చెందిన రన్నర్ గుగ్గిలం అశోక్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మంగళవారం ప్రకటించారని అశోక్ తెలిపారు. అశోక్ కామారెడ్డి జిల్లాలోని రవాణా శాఖలో హోంగార్డుగా పని చేస్తున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో 2కే, 3కే, 10కే, 21కే విభాగాలలో తెలంగాణ రన్ పోటీలు జరగనున్నట్లు ఆయన తెలిపారు.

పత్తికి ప్రోత్సాహం కరువు

- ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్న రైతులు
- మూతపడుతున్న జిన్నింగ్ మిల్లులు
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు

మద్నూర్ ఒకప్పుడు జిల్లాలో పత్తి మిల్లులకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. గతంలో ఇక్కడ 20 జిన్నింగ్ మిల్లులుండేవి. ఐదారు వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించేది. ఇప్పుడు ఏడు మిల్లులు మాత్రమే మిగిలాయి. పత్తి పంటకు ప్రోత్సాహం లేక రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారు. దీంతో మిల్లులు నడవక మూతపడుతున్నాయి.



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో కాటన్ ఇండస్ట్రీ అంటే గుర్తుకు వచ్చేది మద్నూర్. అప్పట్లో 20 జిన్నింగ్ మిల్లులు ఉండేవి. రాత్రి, పగలు పరిశ్రమలు నడిచేవి. దాదాపు నాలుగు వేల మందికి ప్రత్యక్ష ఉపాధి, మరో రెండు మూడు వేల మందికి పరోక్ష ఉపాధి లభించేది. ప్రభుత్వానికి ముఖ్యంగా మార్కెట్ కమిటీకి మంచి ఆదాయం సమకూరేది. ఇదంతా గతం. పత్తికి ప్రోత్సాహం కరువవడంతో ఇప్పుడు ఏడు జిన్నింగ్ మిల్లులు మాత్రమే మిగిలాయి. గతంలో నవంబర్ నుంచి జూన్ వరకు పత్తి వ్యాపారం జరిగేది. పత్తి విస్తీర్ణం తగ్గుతుండడంతో కొనుగోళ్లు మూడు నెలల్లో పూర్తవుతున్నాయి. దీంతో కేవలం మూడు నెలల పాటు రెండు మూడు వందల మందికి మాత్రమే ఉపాధి దొరుకుతోంది.

స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేస్తే...

జుక్కల్ ప్రాంతంలో స్పిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. అప్పట్లో స్పిన్నింగ్ మిల్లు ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగినా కార్యరూపం దాల్చలేదు. స్పిన్నింగ్ మిల్లులకు అవసరమైన పత్తిని జిన్నింగ్ మిల్లుల ద్వారా శుద్ధి చేసి అందించేందుకు ఇక్కడ అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న మద్నూర్ మండలం మీదుగా 161 వ నంబరు జాతీయ రహదారి వెళుతుంది. హైదరాబాద్, సంగారెడ్డి, నాందేడ్ ప్రాంతాలకు మంచి రవాణా వ్యవస్థ ఉంది. అలాగే కర్ణాటకలోని బీదర్ ప్రాంతానికి కూడా సమీపంలోనే ఉంటుంది. ఇక్కడ స్పిన్నింగ్ మిల్లు ఏర్పాటు కాకపోవడంతో శుద్ధి చేసిన పత్తిని బేళ్లుగా కట్టలు కట్టి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయాల్సి వస్తోంది. స్థానికంగా స్పిన్నింగ్ మిల్లులు ఉంటే వాటికి సరఫరా చేయడం సులువవుతుంది. స్పిన్నింగ్ మిల్లు ఏర్పాటైతే అటు రైతులకు, ఇటు జిన్నింగ్ మిల్లులకు ప్రయోజనం ఉంటుంది. మరో వైపు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ప్రభుత్వాలు స్పందించి, స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేయాలని పత్తి రైతులు కోరుతున్నారు.

ఆదాయం వస్తున్నా..

నల్లరేగడి నేలలకు తోడు పూర్తిగా మెట్ట ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గంతో పాటు పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలూకా, అలాగే కర్ణాటకలోని ఔరాద్ ప్రాంతంలో గతంలో పత్తి పంట విస్తృతంగా సాగయ్యేది. 1960 ప్రాంతంలోనే అక్కడ పత్తి పంట సాగు చేసేవారు. ఈ నేపథ్యంలో మద్నూర్ మండల కేంద్రంలో 1966 లో మార్కెట్ కమిటీ ఏర్పాటైంది. అంటే దాదాపు ఆరు దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో పత్తి సాగు, పత్తి దందా నడుస్తున్నాయి. ఏటా రూ. వందల కోట్ల విలువైన పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది (2024–25) సీసీఐ ద్వారా 1,00,432 క్వింటాళ్లు, ప్రైవేటు వ్యాపారులు 97,994 క్వింటాళ్ల మేర పత్తి కొనుగోలు చేశారు. దాదాపు రూ.130 కోట్ల విలువైన పత్తి దందా సాగింది. దీని ద్వారా మద్నూర్ మార్కెట్ కమిటీకి రూ.2.65 కోట్ల ఆదాయం సమకూరింది.

వరి సాగుకు మొగ్గు..

పత్తి సాగును సర్కారు ప్రోత్సహించకపోవడంతో నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో రైతులందరూ వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. దున్నకం నుంచి కోతల దాకా యంత్రాలు అందుబాటులోకి రావడంతో వరి సాగు సులువైంది. వరికి విస్తృతంగా కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. కానీ జిల్లాలోని పలు ప్రాంతాలలో పత్తి సాగవుతున్నా.. జుక్కల్ ప్రాంతంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కామారెడ్డి ప్రాంతంలో తాడ్వాయి, గాంధారి, మాచారెడ్డి, సదాశివనగర్, లింగంపేట, రాజంపేట తదితర మండలాల్లో కూడా పత్తి సాగైనప్పటికీ ఇక్కడ జిన్నింగ్ మిల్లులు లేకపోవడంతో దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తుండడంతో గిట్టుబాటు కాక రైతులు వరివైపు మొగ్గు చూపుతున్నారు. తెల్లబంగారంగా పిలవబడే పత్తి సాగు చేసిన రైతులకు కాలం అనుకూలిస్తే మంచి లాభాలు వస్తాయి. ఈ నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా సర్కారు పత్తి సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

కాశికా పురాధినాథ కాలభైరవం భజే



రామారెడ్డి : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఇసన్నపల్లి(రామారెడ్డి)లోని కాలభైరవ స్వామి ఆలయంలో వైశాఖమాస మూడో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. 108 రకాల కూరగాయలతో స్వామివారిని అలంకరించారు. అనంతరం అర్చకులు శ్రీనివాసశర్మ, వంశీకృష్ణ శర్మలు స్వామివారికి నైవేద్యం సమర్పించారు. స్వామివారికి అలంకరించే కరెన్సీ దండకు భక్తులు విరాళలు భారీగా సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు గుప్తా, జూనియర్ అసిస్టెంట్లు లక్ష్మణ్, నాగరాజ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గంజి సతీష్‌గుప్తా పాల్గొన్నారు.



కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

మున్నూరు కాపులు ఐక్యత చాటాలి

- రాజ్యాంగ బద్ధంగా రాష్ట్ర కమిటీ ఎన్నికలు
- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవన్న



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో మున్నూరు కాపులు ఐక్యత చాటాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ అధ్యక్షతన రాష్ట్ర ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల నిర్వహణపై చర్చించి సూచనలిచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధంగా త్వరలో రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రమంలో గ్రామ, మండల, అన్ని కమిటీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు మొదటిసారిగా ఓటు హక్కును కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల్లో ఎన్నికల కార్యనిర్వహణ కమిటీలు నియమించి వారి ద్వారా మండల, పట్టణ, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులకు ఓటర్ ఐడీ అందజేసి, జాబితాను సిద్ధం చేసి రాష్ట్ర ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల జాబితాలను రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌లు కేంద్ర మంత్రి బండి సంజయ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, గంగుల కమలాకర్, రవిచంద్రలు పరిశీలించి రిటైర్డ్ జడ్జిల తో సమక్షంలో 119 నియోజక వర్గాల్లో ఒకేరోజు బ్యాలెట్ పత్రాలతో ఎక్కడికక్కడే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఇందులో గ్రామస్థాయి సభ్యులకు ఓటు హక్కు కల్పించి సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకునేందుకు తెలంగాణలో 25వేలకు పైగా సంఘాల కమిటీ సభ్యులు ఈ ఎన్నికల్లో పాల్గొంటారని వివరించారు. కాపులు రాజకీయాల్లో రాణించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ఆగస్టు 30, 31 తేదీలలో అమెరికాలో నిర్వహించే గ్లోబెల్ మున్నూరు కాపు అసోసియేషన్ మహా సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు అంజయ్య, కోశాధికారి ఆంజనేయులు, ప్రతినిధులు క్రాంతి, వెంకట్రాజం, లింగం, శ్రీధర్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలి

- వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- సదాశివనగర్‌లో ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభోత్సవంలో కలెక్టర్ సంగ్వాన్

సదాశివనగర్ : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ సామర్థ్యాన్ని పెంచుకొని పిల్లలకు మంచి విద్యనందించాలన్నారు. వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. మొదటి రోజు శిక్షణలో ఇంగ్లిష్ సబ్జెక్టుపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో రీజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ అంశాలను నేర్పించాలని శిక్షకులు సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, ఎంఈవో యోసెఫ్, భూగర్భ జల శాఖ జిల్లా అధికారి సతీశ్ యాదవ్, అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుశర్మ, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, ఆర్పీలు శ్రీనివాస్, అనిల్‌కుమార్, శివరంజని, చిరంజీవి, తొమ్మిది మండలాల ఇంగ్లిష్ సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం : ఇంటర్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై ఆయా శాఖాధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 22 నుంచి 29 వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకోసం 30 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 5,088 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలు, 3,873 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 3 నుంచి 6 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

పదో తరగతికి చెందిన 695 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 3 కేంద్రాల్లో జూన్ 3 నుంచి 13 వ తేదీ వరకు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా పరీక్షల నిర్వహణకు అవసరమైన ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌ల నియామకాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బందోబస్తు, ఇతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, డీఈవో రాజు, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్ కుమార్, ఆర్టీసీ డీఎం కరుణశ్రీ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

డిగ్రీ పరీక్షలకు గ్రీన్ సిగ్నల్

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణపై కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. సీఎం రేవంత్‌రెడ్డి హామీతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సమ్మె విరమించాయి. దీంతో ఈ నెల 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

- సీఎం హామీతో సమ్మె విరమించిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- ఊపిరిపీల్చుకున్న విద్యార్థులు, వర్సిటీ అధికారులు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ యూనివర్సిటీల పరిధిలో గత నెలాఖరున ప్రారంభం కావాల్సిన డిగ్రీ పరీక్షలు ప్రైవేటు కళాశాల యాజమాన్యాల సమ్మెతో వరుసగా వాయిదా పడుతూ వస్తున్నాయి. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తేనే డిగ్రీ పరీక్షలకు సహకరిస్తామని లేదంటే సమ్మె కొనసాగిస్తామని కళాశాలల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. కొన్ని వర్సిటీల పరిధిలో డిగ్రీ విద్యార్థుల పరీక్ష ఫీజులను సైతం ఆయా యూనివర్సిటీలకు కళాశాలల యాజమాన్యాలు చెల్లించలేదు. ఒకవైపు యాజమాన్యాలు సమ్మెకు దిగడం, మరోవైపు బుధవారం నుంచి పలు వర్సిటీల్లో పరీక్షలు జరగాల్సి ఉండగా.. అసలు ఈ పరీక్షలు జరిగేనా? లేదా? అనే సందిగ్ధత డిగ్రీ ఫైనలియర్ విద్యార్థుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) ప్రతినిధులతో సోమవారం చర్చలు జరిపారు. చర్చలు ఫలప్రదం కావడంతో డిగ్రీ పరీక్షలకు మార్గం సుగమమయ్యింది. ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని, రీయింబర్స్‌మెంట్ బకాయిలిచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని, రూ.300 కోట్ల బకాయిల విడుదలకు సీఎం హామీ ఇచ్చారని సమ్మెను విరమించాలని బాలకిష్టారెడ్డి కోరారు. దీంతో కాలేజీల యాజమాన్యాలు సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించాయి. రాష్ట్ర కమిటీ సూచన మేరకు తెలంగాణ వర్సిటీ పరిధిలోని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు ఈ నెల 16 నుంచి జరగాల్సిన డిగ్రీ పరీక్షలకు పూర్తిగా సహకరిస్తామని వర్సిటీ ఉన్నతాధికారులకు మంగళవారం తెలియజేశారు. వర్సిటీ పరిధిలో ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న డిగ్రీ రెగ్యులర్ 2, 4, 6 సెమిస్టర్లు, బ్యాక్‌లాగ్ (2020 నుంచి 2024 వరకు) 1, 3, 5 సెమిస్టర్ల పరీక్షలకు సంబంధించి విద్యార్థులు బుధవారం నుంచి కళాశాలల్లో హాల్‌టికెట్లు పొందవచ్చని కంట్రోలర్ సంపత్‌కుమార్ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బాన్సువాడ రూరల్ : కొత్తాబాదిలో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో జాతీయ రహదారి పనుల మూలంగా రెండు బోర్లతో పాటు మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమయ్యాయి. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తడంతో సోమవారం మహిళలు రాస్తారోకో చేపట్టారు. స్పందించిన అధికారులు మంగళవారం గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని పంచాయతీకి సంబంధించిన మరో బోరుబావినుంచి కనెక్షన్ ఇచ్చి సమస్య పరిష్కరించారు. జాతీయ రహదారి విస్తరణ విభాగం, మిషన్ భగీరథ విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని భవిష్యత్తులో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని బాన్సువాడ డీఎల్‌పీవో వెంకటసత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో ముజాహిద్, పంచాయతీ కార్యదర్శి గణేష్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర



ఎస్ఆర్‌కే సెంటర్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా పాలిసెట్

కామారెడ్డి అర్బన్ : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం మంగళవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 6 పరీక్ష కేంద్రాలలో పాలిసెట్ నిర్వహించారు. 2,900 మందికిగాను 2,766 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రాసిన వారిలో 1,324 మంది బాలు రు, 1,442 మంది బాలికలు ఉన్నారు. పాలిసెట్‌కు 95.37 శాతం విద్యార్థులు హాజరయ్యారని సెట్ జిల్లా సమన్వయకర్త, కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం సెంటర్ల వద్ద పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ రాజేశ్ చంద్ర తనిఖీ చేశారు. అభ్యర్థుల వెంట వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సరైన వసతులు లేకపోవడంతో ఎండలో ఇబ్బందులు పడ్డారు.



శ్రీఆర్యభట్ట పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

పేదల ఇంటికల నెరవేరింది

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- పదేళ్లుగా నియోజకవర్గానికి అందని ఇళ్లు



ఎల్లారెడ్డిలో ఏడో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే



ఎల్లారెడ్డిలో అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: పేదల ఇంటి కల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పూర్తవుతుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏడో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పదేళ్లుగా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఒక్క ఇల్లు కూడా రాలేదన్నారు. మొదటి విడతలో మంజూరైన వారికి మంజూరు పత్రాలను అందించడం జరిగిందని, మిగితా వారికి విడతల వారిగా ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తామన్నారు. ఎల్లారెడ్డికి 40 ఏళ్ల క్రితం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా తిరిగి ఇప్పుడు తన హయాంలోనే ఇండ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. అమృత్ 2.0 పథకం ద్వారా రూ. 35 కోట్ల నిధులతో ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని అన్ని ఇండ్లకు నీటి కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.

వారం రోజుల్లో బస్టాండ్‌ను ప్రారంభిస్తాం

ఎల్లారెడ్డి బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో వారం రోజుల్లో మంత్రి చేతుల మీదుగా బస్టాండ్‌ను ప్రారంభించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు సైతం వేగంగా జరుగుతున్నాయని ఆస్పత్రి సైతం త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

పట్టణంలోని గాంధీ చౌక్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబలి కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంబలి కేంద్రంతో అందరి దప్పిక తీరుతుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కుడుముల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

పట్టణంలోని దేవి ప్రైవేటు ఆస్పత్రిలో గైనిక్ విభాగాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రారంభించారు. ఆస్పత్రిలో నూతనంగా గైనిక్ విభాగంలో భాగంగా సర్జరీ, ఐవీఎఫ్ విభాగాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు పేదవారికి సైతం తక్కువ చార్జీలతో వైద్యం అందించాలని సూచించారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ పద్మశ్రీకాంత్ కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ పద్మ శ్రీకాంత్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పరామర్శించారు. ఇటీవల శ్రీకాంత్ నాయినమ్మ పద్మసాయమ్మ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఈకార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సామెల్, షేకావత్, అరుణ, వాసవి, భూమయ్య, బాల్‌రాజ్, సంతోష్, పప్పు వెంకటేశం, తిరుపతి, మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్, వార్డు ఆఫీసర్, దేవిఆస్పత్రి నిర్వాహకులు మహిపాల్, శ్రావణి, వైద్యులు తదితరులున్నారు.

మద్నూర్‌లో రథోత్సవ సంబురం



మద్నూర్‌లో రథాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు



కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



మద్నూర్‌లో తలపడుతున్న మల్లయోధులు

- పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- ఉత్కంఠగా సాగిన కుస్తీ పోటీలు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆలయంలో రథపౌర్ణమి సందర్భంగా రథోత్సవ సంబురం వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి కొనసాగుతున్న రథోత్సవ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా గ్రామస్తులు రథాన్ని ఊరేగించారు. రథానికి అందంగా రంగులు దిద్ది, రంగు రంగుల విద్యుత్ దీపాలతో రెండు రోజుల పాటు ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రంలో నిర్వహించిన రథోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ఎమ్మెల్యే ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సారి పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ప్రజలందరు జీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. రథోత్సవం సంబర్భంగా గోశాలలో నిర్వహించిన కుస్తీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పోటీలో పాల్గొనే మల్లయోధులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కుస్తీ పోటీలను అభిమానుల మధ్య కూర్చొని ఎమ్మెల్యే పోటీలను తిలకించారు. తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి మల్లయోధులు రూ.వంద నుండి రూ. 5 వేల వంద వరకు జరిగిన కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. గెలిచిన వారికి ఎమ్మెల్యేను బహుమతిని అందించారు. కార్యక్రమంలో మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్, నాయకులు హన్మండ్లుస్వామి, సాయిపటేల్, గంగాధర్, విజయ్, నగేశ్‌పటేల్, రమేశ్, కృష్ణపటేల్, శివాజీ, గోపి, దత్తు, దీన్‌దయాల్, గ్రామస్తులు హన్మండ్లు, సంజు, పింకు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా నిర్మించుకోవాలి



తాడ్వాయి మండలం దేవాయిపల్లిలో ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న అధికారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల ప్రత్యేక అధికారి రాజారాం సమక్షంలో సిబ్బంది మార్కింగ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికి ఇళ్లు మంజూరు చేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, శివాజీ, రాజేశ్వర్‌రెడ్డి, గ్రామపెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మంగళవారం ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. గ్రామంలో నలుగురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారు. ప్రభుత్వం నుంచి రూ. 4 లక్షల చొప్పున డబ్బులు చెల్లించామ న్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ గంగాప్రసాద్ తదితరులు ఉన్నారు.

రాజంపేట : మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి కె అపర్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె రఘురాం ఆధ్వర్యంలో మంగళవారం మండల పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ విషయంపై అవగాహన కల్పించారు. రాజీవ్ యువ వికాసం బ్యాంకర్స్, మేనేజర్ కలిసి సిబిల్స్ చెక్ చేయడంపై వివరించారు.

భారత ఆర్మీకి కృతజ్ఞతలు తెలిపిన వాకర్స్



కామారెడ్డి టౌన్: పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణ నేపథ్యంలో దేశానికి రక్షణగా నిలిచిన భారత ఆర్మీకి జై గురుదేవ్ వాకర్స్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌పార్క్‌లో పహల్గాం మృతులకు నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు రావుల గంగాధర్, క్రాంతి, మసూద్‌అలీ, వెంకట్రాజం, శ్రీను తదితరులున్నారు.

ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం



బీబీపేట: చిన్నప్పుడే తల్లిదండ్రులకు దూరమై తోడపుట్టిన ముగ్గురు చెల్లెల్లకు పెళ్లిళ్లు చేసిన జనగామ గ్రామానికి చెందిన పేదింటి ఆడబిడ్డ బోనగిరి జ్యోతి పెళ్లికి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ రూ. 20 వేలు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్‌లు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. జ్యోతి ముందుగా ముగ్గురు చెల్లెల్ల పెళ్లిళ్లు చేసి వారి కాపురాలు చక్కదిద్దింది. ఆమెకు పెళ్లి కుదరడంతో స్థానిక నాయకులు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొబ్బురి బాపురెడ్డి, పాత పండరి, రేగుల సంతోష్, పర్శరములు తదితరులున్నారు.

నిరుద్యోగులందరికీ వర్తింపచేయాలి



రామారెడ్డి: రాజీవ్‌యువ వికాసం పథకాన్ని నిరుద్యోగులందరికీ వర్తింపజేయాలని మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పడగెల శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులకు రూ. 50 వేల నుంచి నాలుగు లక్షల వరకు సబ్సిడీపై ఇస్తామని దరఖాస్తులు తీసుకుని, ఇప్పుడు ప్రభుత్వం కొర్రీలు పెట్టి మోసం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి ల్యాగల మైపాల్, సీనియర్ నాయకులు బాల్దేవ్ అంజన్న, డాక్టర్ సుధాకర్, నోముల లింగం, పూసల లింగం, సంపత్ , కిషన్ గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాలివానకు ధ్వంసమైన ఇళ్ల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అచ్చాయపల్లిలో సోమవారంరాత్రి కురిసిన గాలివానకు పలువురి ఇళ్లు ధ్వంసమయ్యాయి. గ్రామంలోని ఓ ఇంటిపై చెట్టు విరిగిపడటంతో పక్కనే ఉన్న బాత్‌రూం ధ్వంసమైంది. పాఠశాల పక్కనే చెట్టు సైతం కూలిపడడంతో పాఠశాల ఆవరణలోని కిచెన్‌షెడ్డు ధ్వంసమైంది. దీంతోపాటు గ్రామంలో విద్యుత్‌వైర్లు తెగి స్తంభం సైతం విరిగిపోయింది. మంగళవారం నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, పంచాయతీ ప్రత్యేకాధికారి పిచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రాములు తదితరులు గ్రామానికి చేరుకొని గాలివానకు ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. గాలివాన తీవ్రతకు 8ఇళ్లు పూర్తిగా, మరో 12ఇళ్లు పాక్షికంగా ధ్వంసమైనట్లు వారు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట : మండలంలోని జంగమాయిపల్లి గ్రామంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత అందించారు. గ్రామానికి చెందిన సాయిలుకు రూ. 44 వేలు, ఎల్లయ్యకు రూ. 26 వేల చెక్కులను ఆమె అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, భూషణం తదితరులున్నారు. లింగంపేట మండల కేంద్రానికి చెందిన ఆరుగురు బాధితులకు రూ. 1,74,500 విలువ గల చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి చెక్కులను అందజేసినట్లు తెలిపారు.

విరబూసిన మే పుష్పం



కామారెడ్డి అర్బన్: స్థానిక కాకతీయ నగర్‌లోని విశ్రాంత ఉపాధ్యాయుడు, కవి, రచయిత సిరిగాద శంకర్ ఇంటి ఆవరణలో విరబూసింది. ఎండలు బాగా ఉంటే మే నెలలోనే పూయడం ఈ పుష్పం ప్రత్యేకత అని శంకర్ అన్నారు. మొగ్గ నుంచి పువ్వుగా విచ్చుకోవడానికి 20 రోజులు పడుతుందన్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు



పిట్లం(జుక్కల్): మండలంలోని గద్దగుండు తండా సమీపంలో జాతీయ రహదారి 161పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. శంకరంపేట్ మండలంలోని ఆరపల్లి గ్రామానికి చెందిన బైక్‌పై సోమవారం రాత్రి అంతర్గాం నుంచి మాసన్‌పల్లి గ్రామానికి బయలుదేరాడు. పిట్లం మండలంలోని గద్దగుండు తండా సమీపంలో జాతీయ రహదారిపై అతడి బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో సాయిలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. తీవ్రగాయాలైన వారిని చికిత్స నిమిత్తం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108లో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికు తరలించారు.

బస్సు కిందపడి మహిళ మృతి



ఎడపల్లి(బోధన్): ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కిందపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన ఎడపల్లి మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన చాకలి నాగమణి ఇటీవల పని నిమిత్తం నిజామాబాద్ వచ్చింది. మంగళవారం బోధన్ బస్ ఎక్కి మంగళపాడ్ వద్ద దిగింది. అయితే నాగమణి బస్సు ముందు నుంచి వెళ్తుండగా డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు తీసుకెళ్లడంతో ఆమె చక్రాల కింద పడింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన దండుగుల ఎల్లయ్య(57) భార్య మూడు సంవత్సరాల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి అతడి ఆరోగ్యపరిస్థితి బాగా లేదు. దీంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగ మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

వేల్పూర్ మండల కేంద్రంలో..

వేల్పూర్: ఘర్షణలో గాయపడిన ఓ వ్యక్తి పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ థాబ్రేజ్ (38), గుపాల్వార్ శ్రీనివాస్, అమ్మాల్వార్ వెంకటేశ్ కలిసి ఇంటి కూన పెంకులు మరమ్మతుల పనిచేసేవారు. ఇటీవల పనిచేసిన చోట కూలీ డబ్బుల విషమై ఏర్పడిన విభేదాలతో షేక్ థాబ్రేజ్‌ను శ్రీనివాస్, వెంకటేశ్ కర్రలతో తీవ్రంగా గాయపర్చారు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మంగళవారం అతడిని ఇంటికి తీసుకురాగానే పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి సోదరి ఖలేదా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భిక్కనూరు టోల్ గేట్ వద్ద ట్రాఫిక్ జామ్



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద మంగళవారం గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మంగళవారం కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న భారీ వాహనం టోల్‌ప్లాజా మీదుగా వెళ్తు అక్కడ ఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్ని ధ్వంసం చేసింది. దీంతో వేకువజామున నెట్‌వర్క్ సిగ్నల్ నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గంట తర్వాత సిబ్బంది మరమ్మతులు చేయడంతో ట్రాఫిక్ క్లియరెన్స్ చేశారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా నాయకుడి అరెస్టు



ముఠా నాయకుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సందీప్, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

ఇందల్వాయి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు సిద్దిపేట్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాలోని ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది ఎ1- దాసరి మురళీకృష్ణ, ఎ-2 దాసరి నర్సయ్య, ఏ3-గణేష్, ఏ4- రాజేష్, ఏ5- రావుల శివ, ఏ6-సమ్మక్క, ఏ7-భవాని, ఏ8-రేణుక, ఏ9-నాగయ్యలు సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని, దొంగల ముఠాగా ఏర్పడి, గత కొన్ని నెలలుగా చోరీలకు పాల్పడుతున్నారు. గత నెలలో ముఠాలోని ఇద్దరి సభ్యులను (రాజేష్, రావుల శివ) లను పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించారు. మిగిలిన సభ్యుల కోసం డిచ్‌పల్లి సీఐ మల్లేష్ పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలు గాలించగా మంగళవారం ఇందల్వాయి ఎస్సై సందీప్, సిబ్బంది కలిసి ముఠాలోని ముఖ్య నాయకుడు దాసరి మురళీకృష్ణను పట్టుకున్నారు. నిందితుల నుంచి 7తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. అలాగే మొబైల్‌ఫోన్, రూ.1500 నగదు, రెండు రోల్డ్‌గోల్డ్ నెక్లెస్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మురళి ఇదివరకే నేర చరిత్ర కలిగి, పలుమార్లు జైలుకు వెళ్లాడు.

బోరుమోటార్ల చోరీ కేసులో నిందితులు..



వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో చోటుచేసుకున్న బోరుమోటార్ల దొంగతనం కేసులో మంగళవారం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని పలు గ్రామాలలో గత రెండు, మూడునెలలుగా వరుసగా బోరుమోటార్ల దొంగతనం జరిగింది. బోరుమోటార్ల దొంగతనంపై పలువురు రైతుల ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఈక్రమంలో మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన పోతరాజు రాములు అలియాస్ తుకారం, ఈటెల శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు దొంగతనం చేసినట్లు అంగీకరించారని తెలిపారు. మొత్తం 18మోటార్లను దొంగతనం చేసినట్లు వారు ఒప్పుకున్నారన్నారు. ప్రస్తుతం 6మోటార్లను, దొంగతనం చేసేందుకు వినియోగించిన బైక్‌ను రికవరీ చేశామన్నారు. మోటార్లను బోయిని సత్యం అనే వ్యక్తి తీసుకున్నట్లు తమకు ప్రాథమిక సమాచారం అందిందన్నారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతుందని, విచారణ పూర్తయిన తర్వాత మరిన్ని మోటార్లు స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రాములు, శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి, ఏఎస్సై ఉమేశ్, కానిస్టేబుల్ సందీప్, హోంగార్డులు రాజు,ఆశయ్య ఉన్నారు.

సూర్బిర్యాల్‌లో ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం సూర్బిర్యాల్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన షేక్ జమాలుద్దీన్(29) భార్య సంవత్సరం క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై, తరచూ బాధపడుతుండేవాడు. కాగ ఈనెల 10న రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత గాలించిన ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామంలోని చెరువులో అతడు శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కామారెడ్డి పట్టణంలో..

కామారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంట కాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పెద్దకొడప్గల్కు చెందిన సయ్యద్ గౌస్ (56) కొంతకాలంగా కామారెడ్డికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబంతో కలిసి బతుకమ్మకుంటలో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసై కొద్ది రోజులుగా ఏ పని చేయడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

గాయపడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

కమ్మర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తి ప్రాణాలను పోలీసులు కాపాడిన ఘటన కమ్మర్‌పల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన సామెర మురళి, తన కొడుకు ముఖేష్ చంద్ర చెరో బైక్‌పై భీమ్‌గల్ వెళ్లి మంగళవారం అర్ధరాత్రి తిరిగి చౌట్‌పల్లికి బయలుదేరారు. మురళి ఇంటికి చేరుకోగా, ముఖేష్‌చంద్ర ఇంటికి చేరుకోలేదు. దీంతో మురళి కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డికి సమాచారం అందించారు. ఎస్సై స్పందించి బ్లూకోర్టు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సర్జన్‌కుమార్, హోంగార్డు గణపతిలను అలర్ట్ చేసి, ముఖేష్ చంద్ర లోకేషన్ ట్రాక్ చేశారు. కానిస్టేబుళ్లు బషీరాబాద్ నుంచి కోనసముందర్ వరకు వెతుకుతుండగా.. కాడి చెరువు సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన పొదల్లో స్పృహ కోల్పోయి ఉన్న ముఖేష్ చంద్రను గుర్తించారు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాప్రాయ స్థితి నుంచి బయటపడటంతో కానిస్టేబుళ్లను ఎస్సై అభినందించారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో ఇటీవల సిబ్బంది డ్రంకన్‌డ్రైవ్ తనఖీలు చేపట్టారు. ఈక్రమంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 46 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం జిల్లా మార్నింగ్ కోర్టులో మంగళవారం వారిని హాజరు పర్చగా స్పెషల్ జ్యుడీషియల్ 2వ క్లాస్ మెజిస్ట్రేటు నూర్జహన్ బేగం వారిలో 22 మందికి జరిమానాలు విధించగా, 24 మందికి జైలు శిక్ష విధించారు. వారిలో ముగ్గురికి మూడు రోజులు, 12 మందికి రెండురోజులు, 9 మందికి ఒక రోజు శిక్షలు విధించినట్లు ఏసీపీ తెలిపారు.

ధర్పల్లి మండలంలో..

ధర్పల్లి: మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్దుల్ చౌరస్తా వద్ద ఈనెల 6న పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడన్నారు. దీంతో పోలీసులు అతడిని నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఏడుగురు పట్టుబడ్డారు. వీరిని మంగళవారం ఆర్మూర్ కోర్టు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై రామ్ తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: నవీపేట శివారులో రెండు రోజుల కిందట పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఐదుగురు పట్టుబడ్డారు. వీరిని మంగళవారం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

నందిపేట మండలంలో..

నందిపేట: మండల కేంద్రంలో సోమవారం పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ తొమ్మిది మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం ఆర్మూర్‌లోని సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఎదుట హాజరుపర్చగా 8మందికి రూ.2000 చొప్పున జరిమానా విధించగా, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

దుకాణ నిర్వాహకులకు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో రాత్రి సమయంలో దుకాణాలు నడిపిస్తున్న ముగ్గురిని అరెస్టు చేయగా, జడ్జి రెండు రోజుల పాటు సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. పెర్కిట్‌లో ప్రతిరోజుల రాత్రి సమయంలో నిబంధనలకు విరుద్ధంగా మదీనా హోటల్, మదీనా పాన్‌షాప్, యాసీన్ హోటల్‌లు నడిపిస్తున్న షేక్ మాజీద్, షేక్ సాజిద్, షేక్ ఫారుక్‌లపై ఇటీవల పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరు పర్చగా మార్నింగ్ కోర్టు మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్‌రెడ్డి వారికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.